
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం: 29.0 । కనిష్ఠం: 23.0
ANDHRAJYOTHY



చిన్నోనిపల్లికి.. నీటి ముప్పు



రిజర్వాయర్‌లోని నీటిని బయటికి వదలాలని కట్టపై ఆందోళనకు దిగిన చిన్నోనిపల్లి గ్రామస్థులు

- వర్షాలతో రిజర్వాయర్‌లో భారీగా నిలిచిన నీరు
- పునరావాస కేంద్రంలో కల్పించని మౌలిక వసతులు
- నేటికీ అందని షిఫ్టింగ్ చార్జీలు
- ఫలితంగా గ్రామాన్ని ఖాళీ చేయని గ్రామస్థులు
- ఊర్లోకి నీళ్లు వస్తుండటంతో ఆందోళన
- రైతుల నిరసనతో నీరు బయటికి వెళ్లడానికి కాల్వ తవ్వించిన కాంట్రాక్టర్

గట్టు, ఆగస్టు 23: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో నెట్టెంపాడు ప్రాజెక్టులోని చిన్నోనిపల్లి రిజర్వాయర్ ముంపు గ్రామం చిన్నోనిపల్లికి ముప్పు ఏర్పడింది. రిజర్వాయర్‌లో ఈ గ్రామం ముంపునకు గురికానుండటంతో 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ముంపు గ్రామంగా ప్రకటించింది. 101 ప్యాకేజీ కింద గ్రామంలోని 251 ఇళ్లు ముంపునకు గురవుతాయని జీవో విడుదల చేసింది. నాటి నుంచి గ్రామం ప్రభుత్వ రికార్డుల్లో ముంపు గ్రామంగా నమోదైంది. అయితే పునరావాస కేంద్రంలో సౌకర్యాలు కల్పించకపోవడంతో గ్రామస్థులు ఊరును ఖాళీ చేయలేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఇరువైపులా ఉన్న రెండు పెద్ద వాగుల ద్వారా రిజర్వాయర్‌లోకి నీరు చేరుతోంది. ఇది వరకు రిజర్వాయర్ కట్ట దగ్గర వాగులు పారే ప్రాంతం మధ్యలో మట్టి కట్టను నిర్మించకుండా వదిలేశారు. దాంతో వాగుల ద్వారా వచ్చిన నీరంతా అక్కడ ఉన్న గండి ద్వారా దిగువకు వెళ్లేది. రిజర్వాయర్‌లో నిలిచేది కాదు. ప్రస్తుతం అక్కడ గ్యాప్ లేకుండా కట్ట నిర్మించడంతో నీరు దిగువకు వెళ్లకుండా రిజర్వాయర్‌లోనే నిలుస్తోంది. దాంతో రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న నీరంతా వెనక్కి ఊర్లోకి వస్తుండటంతో గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు.



రైతుల ఆందోళనతో రిజర్వాయర్‌లోని నీళ్లు బయటికి వెళ్లేందుకు ఎక్స్‌కవేటర్‌తో తవ్వుతున్న కాల్వ



వర్షాలతో రిజర్వాయర్‌లో నిలిచిన నీరు

వసతులు కరువు

ముంపు గ్రామాన్ని కొత్తగా నిర్మించడానికి ఎర్రగట్టు ప్రాంతంలో ప్రభుత్వ భూములతో పాటు కొంత పట్టా భూములను సేకరించారు. లే అవుట్ వేసి 360 మందికి పట్టాలు అందించారు. అక్కడ విద్యుత్, తాగునీరు, డ్రైనేజీలు, రోడ్లు తదితర మౌలిక వసతులు కల్పించ లేదు. దాంతో గ్రామస్థులు ఊరును ఖాళీ చేసి వెళ్లలేకపోతున్నారు. ఈ విషయమై గత ప్రభుత్వ పెద్దలతో పాటు స్థానిక నాయకులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. 70 మంది వరకు షిఫ్టింగ్ చార్జీలు కూడా చెల్లించ లేదు.

గ్రామస్థుల ఆందోళనతో దిగివచ్చిన కాంట్రాక్టర్

రిజర్వాయర్‌లోకి నీరు చేరడంతో గ్రామస్థులు శుక్రవారం కట్టపైకి చేరుకుని ఆందోళనకు దిగారు. రిజర్వాయర్‌లోని నీటిని దిగువకు వదలాలని, అందు కోసం కట్ట వెనుక కాల్వ తవ్వాలని కాంట్రాక్టర్‌ను కోరారు. దాంతో కాంట్రాక్టర్ కాల్వ తవ్వకం పనులు ప్రారంభించారు. కాల్వ తవ్వుతుండగా కొందరు రైతులు అది తమ భూమి అని, తమకు పరిహారం రాలేదని పనులను అడ్డుకున్నారు. పోలీసులు, గ్రామ కార్యదర్శి వచ్చి ఈ కాల్వ తాత్కాలికంగా మాత్రమేనని చెప్పి పోలీసులు సముదాయించారు. దాంతో కాల్వ పనులు చేపడుతున్నారు.

రిజర్వాయర్‌ను రద్దు చేయాలని ఆందోళన

17 ఏళ్లుగా నిలిచిన రిజర్వాయర్ పనులను 2022లో మళ్లీ ప్రారంభించడంతో ఈ రిజర్వాయర్ కింద ఆయకట్టు లేదని, ఇక్కడి నుంచి ఆంధ్రప్రాంతానికి నీరు తీసుకెళ్లడానికి దీనిని చేపట్టారని, దీనిని రద్దు చేయాలని రైతులు ఆందోళన చేపట్టారు. మండలంలోని చిన్నోనిపల్లి, ఇందువాసి, బోయలగుడ్డం, లింగాపురం, చాగదోణ గ్రామాల నిర్వాసిత రిజర్వాయర్ కట్ట దగ్గర 423 రోజులు పోరాటం చేశారు. రిజర్వాయర్ కోసం సేకరించిన తమ భూములపై హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. పనులను ప్రారంభించడానికి వచ్చిన గత ప్రభుత్వంలో ఉన్న సీఎంవో కార్యదర్శి స్మీతా సబర్వాల్ ఎదుట నిర్వాసిత రైతులు నిరసన తెలిపారు.

మాకు న్యాయం చేయండి



చిన్నోనిపల్లి రిజర్వాయర్ కింద ఆయకట్టు లేదు. ఈ రిజర్వాయర్ వల్ల 2,400 ఎకరాల సాగు భూములను కోల్పోయాము. ఐదు గ్రామాల ప్రజలం భూములు కోల్పోయాం. బతుకుదెరువు కష్టంగా మారింది. రిజర్వాయర్‌ను నిర్మించొద్దని ఆందోళన చేశాం. మా మొరను గత ప్రభుత్వం ఆలకించ లేదు. ఇప్పుడు గ్రామంలోకి నీళ్ల వచ్చాయి. మాకు న్యాయం చేయాలి.

- రామచంద్రగౌడు, చిన్నోనిపల్లి గ్రామస్థుడు

మమ్మల్ని నీటిలో ముంచారు



నాకున్న పొలం రిజర్వాయర్‌లో ముంపునకు గురైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల నీరు రిజర్వాయర్‌లోకి భారీగా చేరింది. రిజర్వాయర్ కట్ట దగ్గర నీరు దిగువకు వెళ్లే ప్రాంతంలో కట్ట నిర్మించడంతో నీరు నిలిచింది. ఆ నీరు దిగువకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. మరో రెండు వర్షాలు కురిస్తే మేము జలగండంలో ఇరుక్కోక తప్పదు. నాయకులు మమ్ములను ఓట్ల కోసం మాత్రమే వాడుకుని, నీటిలో ముంచేశారు.

- వెంకటేష్, నిర్వాసిత రైతు, చిన్నోనిపల్లి



మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డికి ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎమ్మెల్యేలు, అధికారులు

డీసీసీబీ చైర్మన్‌గా మామిళ్లపల్లి ఏకగ్రీవం

- 11 మంది డైరెక్టర్‌ల మద్దతుతో హస్తగతం
- మద్దతుగా నిలిచిన పలువురు బీఆర్ఎస్ డైరెక్టర్లు

మహబూబ్‌నగర్, ఆగస్టు 23: డీసీసీబీ(జిల్లా సహకార కేంద్ర బ్యాంక్) చైర్మన్‌గా పాన్‌గల్ పీఏసీఎస్ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎలాంటి పోటీ లేకపోవడంతో ఎన్నికల ప్రక్రియ సజావుగా ముగిసింది. 11 మంది డైరెక్టర్ల మద్దతుతో కాంగ్రెస్ పార్టీ డీసీసీబీని సొంతం చేసుకుంది. డీసీసీబీ కార్యాలయ ఆవరణలో చైర్మన్ కోసం నిర్వహించిన ఎన్నికల నామినేషన్ గడువు ముగిసే సమయానికి విష్ణువర్ధన్‌రెడ్డి నామినేషన్ ఒకటే దాఖలు అయ్యింది. దాంతో అధికారులు ఆయన్ను ఏకగ్రీవం అయినట్లు ప్రకటిస్తూ ధ్రువీకరణ పత్రం జారీచేశారు. చైర్మన్ అభ్యర్థిత్వాన్ని డైరెక్టర్లు కోరమోని వెంకటయ్య, నర్సింహారెడ్డిలు బలపరిచారు. మెజారిటీ సభ్యుల బలం ఉన్న బీఆర్ఎస్ డైరెక్టర్‌ల మద్దతుతో మహబూబ్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్ కోరమోని వెంకటయ్య బరిలో ఉంటారని ఎన్నికల షెడ్యూల్ వెలువడిన వెంటనే ప్రచారం జరిగింది. వెంకటయ్య అనూహ్యంగా కాంగ్రెస్ శిబిరానికి వెళ్లారు. కాంగ్రెస్ సభ్యులతో కలిసి శుక్రవారం నేరుగా డీసీసీబీకి చేరుకోవడంతో పాటు చైర్మన్ అభ్యర్థిత్వాన్ని బలపరచడంతో ఆయన హస్తం గూటికి చేరుతున్నారన్న సంకేతాలకు బలం చేకూర్చినట్లయ్యింది. ప్రస్తుతం వైస్ చైర్మన్‌గా ఉన్న కోరమోని అదే పదవిలో కొనసాగనున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు సభ్యులు కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడం, సభ్యుల బలం లేకపోవడంతో పోటీకి బీఆర్ఎస్ దూరంగా ఉంది. దాంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. నామినేషన్ వేయడానికి డైరెక్టర్‌లతోపాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, అనిరుద్‌రెడ్డి, వాకిటిశ్రీహరి, చిట్టెం పర్ణికారెడ్డి, మేఘారెడ్డి డీసీసీబీకి చేరుకున్నారు. చైర్మన్‌గా ఎన్నికైన విష్ణువర్ధన్‌రెడ్డిని ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు గజమాల, శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. తనకు మద్దతుగా నిలిచిన ఎమ్మెల్యేలకు విష్ణువర్ధన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు.

రైతు సంక్షేమం కోసం కృషి చేస్తా: చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

పాలమూరు డీసీసీబీకి 105 ఏళ్ల చరిత్ర ఉందని, రైతులకు న్యాయం జరిగేలా ఈ పాలక మండలి పని చేస్తుందని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. తనపై అతిపెద్ద బాధ్యత పెట్టారని, అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల ద్వారానే అభివృద్ధి, ప్రభుత్వ ఫలాలు రైతులకు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. తన నియామకం కోసం కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానని, తన గురువు ఎంపీ మల్లురవి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు చెబుతున్నానని అన్నారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రుణమాఫీ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆఖరి రైతుకు రుణమాఫీ చేసే బాధ్యతను ఎమ్మెల్యేలుగా తాము హామీ ఇస్తున్నామన్నారు. తానూ రైతు బిడ్డనేనని, డీసీసీబీ ఆదర్శంగా ఉండేలా రైతు కార్యక్రమాలు ముందుకు తీసుకుపోతామన్నారు. రుణమాఫీ విషయంలో బీఆర్ఎస్ రైతులను గందరగోళానికి గురిచేసే ప్రయత్నం చేస్తోందని, రైతులెవరూ ఆ పార్టీ మాయలో పడొద్దని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. రైతుదీక్షల పేరుతో బీఆర్ఎస్ చేసిన ధర్నాలకు రైతులెవరూ హాజరు కాలేదన్నారు. కొంతమందికి టెక్నికల్ కారణాల రీత్యా మాఫీ కాలేదన్న విషయం వాస్తవమని, వారికి కూడా మాఫీ జరిగేలా నోడల్ ఆఫీసర్లను నియమించామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, నాయకులు సిరాజ్‌ఖాద్రి. బెనహర్, లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్, ఆగస్టు 23: నారాయణపేట టౌన్, ఆగస్టు 23: ప్రభుత్వ నిబంధనల మేరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం శివారులో సర్వే నెం.374,375లలో ఓ యజమాని తన ప్లాట్ రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా కలెక్టర్ పరిశీలించారు. ప్లాట్ రెగ్యులరైజేషన్ దరఖాస్తును యాప్ ద్వారా ఎలా పరిష్కరించాలో కలెక్టర్‌కు వివరించారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారుల నివేదికలను తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారికి కలెక్టర్ సూచించారు. మూడు శాఖల అధికారుల సమన్వయంతో ప్లాట్ రెగ్యులరైజేషన్ స్కీంకు పరిష్కారం చూపాలని అభ్యంతరాలు ఉంటే నిలిపివేయాలన్నారు.

విద్యార్థుల్లో ఆంగ్లం పట్ల భయాన్ని తొలగించాలి

విద్యార్థుల్లో ఆంగ్లం పట్ల భయాన్ని తొలగించి ఆత్మవిశ్వాసాన్ని నింపాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో రూపొందించనున్న యంగ్ ఆపరేటర్ క్లబ్స్ నిర్వహణపై స్థానిక సాంఘిక సంక్షేమ పాఠశాలలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మార్కులతో సంబంధం లేకుండా ఆంగ్లంలో విద్యార్థులు మాట్లాడేలా తీర్చిదిద్దాలన్నారు. ఈ ఏడాది ప్రతీ తరగతిలో ఆంగ్ల భాష సామర్థ్యాలు మెరుగుపడాలన్నారు. అందుకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ప్రతీవారం రెండు రోజులు ప్రత్యేకంగా కేటాయించాలన్నారు. కార్యక్రమ రూపకల్పనలో విద్యాశాఖకు సహకారం అందిస్తున్న భారత్ దేఖో, ఆలోకిత్, మంత్ర, శిక్షలోకం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు. కలెక్టర్ వెంట ట్రైనీ కలెక్టర్ గరీమానరుల, డీఈవో అబ్దుల్ ఘనీ, ఏఎంవో విద్యాసాగర్, ఏఎస్‌వో శ్రీనివాస్ పాల్గొన్నారు.


కాలుష్య కోరలు

- పంట పొలాల్లో వ్యర్థ జలాలను వదులుతున్న ఫార్మా పరిశ్రమలు
- భూములు, చెరువులు, భూగర్భ జలాలు కలుషితం
- సాగుకు పనికి రాని పొలాలు, తాగడానికి వీలు కాని నీళ్లు

జడ్చర్ల, ఆగస్టు 23: అది వివిధ రోగాలకు ఔషధాలను తయారు చేసి, ప్రపంచ దేశాలకు సరఫరా చేస్తున్న ప్రాంతం. కానీ ఇక్కడి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతోంది. జడ్చర్ల మండలం పోలేపల్లి సమీపంలో గల సెజ్‌లోని ఫార్మా పరిశ్రమల వల్ల పంట పొలాలు, చెరువులు, కుంటలు కాలుష్యం బారిన పడ్డాయి. పరిశ్రమల నుంచి వ్యర్థ జలాలను గుట్టు చప్పుడుకాకుండా పైపులైన్లు ఏర్పాటు చేసి వదులుతుండటంతో ఈ పరిస్థితి నెలకొంది. భూములు పంటలు సాగు చేయడానికి వీలు లేకుండా మారాయి.

కాలుష్యంతో నిండిన గ్రామాలు

గ్రీన్ కారిడార్ ఏర్పాటు కోసం జడ్చర్ల మండలం పోలేపల్లి సమీపంలో వెయ్యి ఎకరాలను టీడీపీ ప్రభుత్వ హయాంలో సేకరించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం టీఎస్ఐఐసీని ఏర్పాటు చేసి, సేకరించిన వెయ్యి ఎకరాల్లో 300 ఎకరాలను సెజ్(స్పెషల్ ఎకనామిక్ జోన్)గా ఏర్పాటు చేసింది. సెజ్‌లో



ఫార్మా పరిశ్రమలు వదులుతున్న కలుషిత నీరు

హెటిరో, అరబిందో, మైలాన్, శిల్పామెడికేర్, ఎవర్టోజెన్ తదితర 11 ఫార్మా పరిశ్రమలను నెలకొల్పారు. ఈ పరిశ్రమలతో తమ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు రావడంతో పాటు అభివృద్ధి చెందుతుందని భావించగా, సెజ్ పరిసరాల్లోని పోలేపల్లి, గుండ్లగడ్డ తండా, రాయపల్లి, ముదిరెడ్డిపల్లి తదితర గ్రామాలు కాలుష్యంతో నిండిపోయాయి.



సెజ్‌లోని పరిశ్రమల నుంచి వెలువడుతున్న పొగ

వ్యవసాయానికి ఉపయోగపడని బోర్ల నీరు

పరిశ్రమల వ్యర్థ జలాల వల్ల జడ్చర్ల మండలం రాయపల్లి గ్రామానికి చెందిన మాధవి, విఠలయ్యగౌడ్, రాజుగౌడ్, వెంకట్రాములు, లక్ష్మణ్‌నాయక్, బిచ్యానాయక్, కుర్వ కృష్ణయ్య వ్యవసాయ భూములు సాగుకు నోచుకోకుండా పోయాయి. ఈ భూములు అనువుగా లేవని వ్యవసాయశాఖ అధికారులు సైతం నివేదికలు ఇచ్చారు. పోలేపల్లి సెజ్‌కు సమీపంలోని గుండ్లగడ్డ తండాలో ఉన్న బోర్లు, ముదిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని పల్లె చెరువు, సెజ్‌కు అతి సమీపంలో గుండ్లగడ్డ తండా ప్రక్కనే గల కుంట సైతం కాలుష్యంతో నిండాయి. దాంతో పరిసర ప్రాంతంలోని భూగర్భ జలాలు సైతం కాలుష్యంతో నిండిపోయాయి. వ్యవసాయ క్షేత్రాల్లోని బోర్ల నీరు వ్యవసాయానికి వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ వ్యర్థ జలాల వల్ల భూగర్భ జలాలు సైతం కాలుష్యం బారిన పడ్డాయని, వాటిని వినియోగించుకునే అవకాశం లేదని సంబంధిత అధికారులు నివేదికలు ఇచ్చారు. కాలుష్యం బారి నుంచి తమ ప్రాంతాన్ని కాపాడాలంటూ ముదిరెడ్డిపల్లికి చెందిన సామాజిక కార్యకర్త [illegible] వెంకటయ్య గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాడు. ఫలితంగా కాలుష్యానికి కారణమైన 11 ఫార్మా పరిశ్రమలు జరిమానా సైతం చెల్లించాయి.

సాగుకు వీలులేకుండా మారిన భూములు

నిబంధనలను పట్టించుకోకుండా పరిశ్రమల్లోని వ్యర్థ జలాలను పైపులైన్ల ద్వారా వర్షాలు పడిన సందర్భంలో బయటికి వదులుతున్నారు. వర్షం నీటిలో కలిసిన వ్యర్థ జలాలు పంట పొలాల్లోకి వెళ్తుండటంతో ఆ భూములు సాగుకు వీలులేకుండా మారాయి. ఫార్మా పరిశ్రమలలో వ్యర్థ జలాలను రీసైక్లింగ్ చేయడంతో పాటు నిర్మానుష్య ప్రాంతంలో వదిలేయాలన్న నిబంధనలను పరిశ్రమల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం బారి నుంచి తమ పొలాలు కాపాడాలంటూ ముదిరెడ్డిపల్లి, రాయికల్ గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన సైతం చేపట్టారు. ఇప్పటికే పలు పర్యాయాలు కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదులు కూడా చేశారు. ఫిర్యాదు చేసిన సందర్భంలో నామమాత్రంగా అధికారులు రావడం, నీటి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు తరలించడం, ఎలాంటి కాలుష్యం లేదంటూ నివేదికలు ఇవ్వడం పరిపాటిగా మారింది.



పోలేపల్లి సెజ్‌లో నీటి కాలుష్యంపై నమూనాలు సేకరించిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు (ఫైల్)

కాలుష్యం నుంచి కాపాడండి

పోలేపల్లి సెజ్‌లోని ఫార్మా పరిశ్రమలు వదులుతున్న వ్యర్థ జలాల నుంచి మా పంట పొలాలను కాపాడాలి. భూములు కాలుష్యం బారిన పడడంతో పంటలు పండించుకోలేని దుస్థితి ఏర్పడింది. దీనిపై 2016 నుంచి ఫిర్యాదులు చేస్తూనే ఉన్నాము. కాలుష్యం ప్రతీ సంవత్సరం పెరుగుతూనే ఉంది తప్ప.. తగ్గడం లేదు. సెజ్ పరిసర ప్రాంతం అంతా జల, వాయు కాలుష్యంతో నిండింది. కలుషిత నీటిని తాగి పశువులు సైతం మృతి చెందాయి. వ్యవసాయాన్ని వదిలేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- మాధవి, రాయపల్లి

మనుగడే ప్రశ్నార్థకంగా మారింది

సెజ్‌లోని ఫార్మా పరిశ్రమలు వర్షా కాలంలో పైపుల ద్వారా వ్యర్థ జలాలను పంట పొలాల్లోకి వదులుతున్నాయి. కాలుష్యం వల్ల పొలాలు కలుషితం అయ్యాయి. అంతర్జాతీయ పరిశ్రమలు ఏర్పడితే తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందంటూ ప్రజాప్రతినిధులు, కొందరు నాయకులు ఉపన్యాసాలు చేశారు. కానీ ఆ పరిశ్రమలతో మా మనుగడే ప్రశ్నార్థకంగా మారింది.

- విఠలయ్యగౌడ్, రాయపల్లి

విద్యుదాఘాతంతో

కాంట్రాక్టు ఉద్యోగి మృతి



రవి (ఫైల్)

అడ్డాకుల, ఆగస్టు 23 : మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండల కేంద్రలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్న మునగాల రవి (27) శుక్రవారం కాటవరంలో ట్రాన్స్‌ఫార్మర్ జంపర్ రిపేరు చేస్తుండగా విద్యుదాఘాతంతో మృతి చెందాడు. అడ్డాకులకు చెందిన రవి ఆరు సంవత్సరాలుగా విద్యుత్ శాఖలో ఉద్యోగం చేస్తున్నాడు. కాటవరంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కోసం విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఫోన్‌చేసి ఎల్‌సీ అడిగాడు. లైన్‌మెన్ పొరపడి కాటవరం గ్రామానికి కాకుండా గుడిబండ గ్రామానికి ఎల్‌సీ ఇచ్చాడు. ఫోన్‌చేసి ఎల్‌సీ ఇచ్చినట్లు లైన్‌మెన్ చెప్పడంతో రవి ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కగా ఒక్కసారిగా విద్యుదాఘాతంతో కిందపడిపోయాడు. స్థానికులు అతన్ని హుటాహుటిన అడ్డాకుల ఆస్పత్రికి, అక్కడి నుంచి మహబూబ్‌నగర్‌కు తరలించగా ఆస్పత్రిలో మృతి చెందాడు. మృతుడికి భార్య సుమలత, నెలన్నర కుమారుడు ఉన్నారు. బాధితులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తామని అడ్డాకుల ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

కుటుంబాన్ని ఆదుకోవాలి

పాలమూరు : విధి నిర్వహణలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన రవి కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, కేవీపీఎస్, రైతు సంఘం నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో 12 ఏళ్ల నుంచి పని చేస్తున్న కార్మికుడి కుటుంబానికి విద్యుత్ సంస్థ నుంచి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు.

పొలం గట్టున భోజనం

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కేసరి సముద్రం ఆయకట్టు వద్ద వరి నాట్లు వేయడానికి వచ్చిన మహిళా కూలీలు అందరూ ఒక చోట కూర్చొని భోజనం చేశారు. కూరలు అందరం పంచుకుంటామని, పచ్చడి, పప్పు, గోకరకాయ, వంకాయ, చింతపండు పులుసు తప్పని సరిగా ఉంటాయని తెలిపారు. మరుసటి రోజు ఏం కూరలు తెచ్చుకోవాలో ముందే అనుకుంటామని చెప్పారు. ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం క్లిక్ మనిపించింది.

- నాగర్‌కర్నూల్, ఆంధ్రజ్యోతి



పోలీస్ వాహనాన్ని ఢీకొని వ్యక్తికి గాయాలు

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 23 : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణ సమీపంలోని కాటన్‌మిల్లు వద్ద పోలీస్ వాహనాన్ని ఢీకొని వ్యక్తికి గాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. కల్వకుర్తి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం సాయంత్రం పట్టణ సమీపంలోని కాటన్‌మిల్లు వద్ద రోడ్డు ప్రమాదానికి సంబంధించి విచారణకు ఎస్‌ఐ మాధవరెడ్డి సిబ్బందితో ఇన్నోవా వాహనంలో వెళ్లగా కేశంపేట మండలం లింగంధనకు చెందిన రాజు మద్యం మత్తులో రోడ్డుపైన ఆగిఉన్న వాహనాన్ని ఢీకొట్టి గాయాలపాలయ్యాడు అతడిని కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంపై అవగాహన

చారకొండ, ఆగస్టు 23: మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో మహాశక్తి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాడిపశువులు, పెరటికోళ్ల పెంపకంపై డ్వాక్రా మహిళలకు అవగాహణ కల్పించారు. ఎంపీడీవో ఇసాక్‌హుస్సేన్ మాట్లాడుతూ స్త్రీనిధి పథకం ద్వారా డ్వాక్రా గ్రూప్ మహిళలకు రూ, 93,500 ఒక ఆవుకు గాని గేదె కు గాని, పెరటి కోడి పిల్లలకు గాను ఒక్కదానికి రూ.35 చొప్పున లోన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏపీఎం బాలచందర్, సీసీలు నిర్మల, మాధవి, వీవోఏలు పాల్గొన్నారు.

కిరాణం డబ్బాలో చోరీ

- రూ.లక్షా 30వేల నగదు అపహరణ - కేసు నమోదు


డబ్బాను ధ్వంసం చేసిన దుండగులు

కొల్లాపూర్, ఆగస్టు 23: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న డబ్బాలో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన సాయి అలియాస్ పేపర్ సాయిబాబా బస్టాండ్‌లో కొన్ని సంవత్సరాలుగా డబ్బా ఏర్పాటు చేసుకుని న్యూస్ పేపర్‌తో పాటు కిరాణా షాపు వ్యాపారం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారు జామున గుర్తు తెలియని దుండగులు డబ్బా వెనుక భాగాన్ని ధ్వంసం చేసి డబ్బాలో ఉన్న రూ.లక్షా 30వేల నగదుతో పాటు షాపులో చిల్లర సామాన్లు అపహరించినట్లు బాధితుడు వాపోయాడు. కష్టపడి పని చేసి నిరుద్యోగుల డబ్బాలలో చోరీకి పాల్పడ్డ దొంగలను గుర్తించాలని పోలీసులకు ఫిర్యాదు చేయగా, బస్టాండ్ ఆవరణంలో ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించినట్లు తెలిసింది. సంఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

మంత్రివర్గ విస్తరణలో బీసీలకు అవకాశం ఇవ్వాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నిరంజన్


సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 23: త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో బీసీలకు రాష్ట్ర హోంశాఖ, విద్యాశాఖలతో పాటు టీపీసీసీ ఉపాధ్యక్ష పదవి ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే మంత్రివర్గ విస్తరణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కృషి చేసిన బీసీ సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలని కోరారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో పాటు మరో ముగ్గురు బీసీ ఎమ్మెల్యేలకు చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్ర బీసీ కుల గణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీల సంక్షేమానికి ప్రతీ వార్షిక బడ్జెట్‌లో రూ.20 వేల కోట్ల నిధులు కేటాయిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. లేకుంటే జాతీయ బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్, యాదగిరి, లక్ష్మణచారి, కృష్ణయ్య, కొత్త శ్రీనివాసులు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాణ భయంతో..

సామాన్యుల కాలనీ ఖాళీ



వీధిలో నిలిచిన మురుగునీరు

- కాలనీవాసులతో అధికారులు, ప్రజాప్రతినిధుల చెలగాటం
- కూలటానికి మరో 30 మట్టి పూరిగుడిసెలు సిద్ధం
- అయిజలోని సామాన్యుల కాలనీలో దుస్థితి
- ఖాళీ చేయాలంటూ మునిసిపల్ అధికారుల నోటీసులు జారీ

అయిజ, ఆగస్టు 23 : పచ్చదనం, పారిశుద్ధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, వర్షం నీరు నిల్వ ఉండకుండా చూడాలని.. వాహన టైర్లలో నీరు నిల్వ ఉంచకుండా చూడాలని.. ఇవన్నీ అధికార, ప్రజాప్రతినిధులు రోజు చెప్పే ప్రవచనాలే కానీ ఆచరణలో మాత్రం వారికి సాధ్యం కాదనే తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే అయిజ పట్టణంలోని నడిబొడ్డున ఈ దుస్థితి నెలకొంది. వర్షం నీరు కాదు కదా ఏకంగా ఒక మురుగునీటి మడుగే ఏర్పడింది.

సామాన్యుల కాలనీలో మురుగునీటి కుంట

అయిజ పట్టణంలోని 14వ వార్డులోని కొత్తపేట కాలనీలో ఈ దుస్థితి నెలకొంది. దాదాపు 80 దాకా పూరిగుడిసెలు ఇక్కడ ఉన్నాయి. కాలనీ మధ్యలో మురుగు, వర్షం నీటితో ఒక చెరువును తలపించే విధంగా ఓ మురుగు నీటి కుంట ఏర్పడింది. ప్రతీనిత్యం దుర్గంధం, దుర్వాసనల మధ్యన సామాన్య జనం కాలం వెళ్లదీస్తున్నారు. వీరివి మట్టితో కూడిన పూరిగుడిసెలు కావటంతో నీటి తంపు కారణంగా మట్టి గోడలు కాస్తా నాని కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి.

నీటి తంపుతో కూలనున్న మరో 30 గుడిసెలు

మొన్న గోడ కూలి పసిపాప శ్రీకృతి ప్రాణాలు వదిలింది. పాప ఇంటి ముందే పెద్ద మురుగునీటి కుంట ఉంది. వారి గుడిసెలా కూలటానికి మరో 30 గుడిసెలు సిద్ధంగా ఉన్నాయి. ఇక్కడ నీరు నిల్వ ఉండటం కారణంగా సామాన్యుల పూరి గుడిసెలు నీటి తంపు ఎక్కి మట్టి గోడలు దెబ్బతింటున్నాయి. కాలనీలో వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు అవసరమైన మురుగు కాలువలు లేవు. దీంతో నీరంతా అక్కడే ఉంటోంది. రెక్కాడితే కాని డొక్కాడని సామాన్య జనం గుడిసెలు తాత్కాలికంగా దెబ్బతిన్న వాటిని సరిదిద్దుకుని అక్కడే జీవనం సాగిస్తున్నారు. అధికారులు ఖాళీ చేయాలని, ప్రమాదభరితంగా ఉన్నాయని నోటీసులు ఇస్తున్నారు. బతికేందుకే కష్టం అనుకుంటున్న వారికి ఉండేందుకు గూడు మరీ కష్టంగా మారింది. ఇది తప్పిస్తే వారికి మరో అవకాశం లేకపోవటంతో కుటుంబ సభ్యులతో ప్రతిరోజు వారిది జీవన, ప్రాణ పోరాటమే మరి.

ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశాం

సామాన్యుల కాలనీలో ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశాం. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా సామాన్యుల మట్టి మిద్దెలు, గుడిసెలు దెబ్బతిన్నాయి. నేల కూలటానికి అవి సిద్ధంగా ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని ప్రాణనష్టం జరగకుండా ఆపేందు కోసం ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం.

- లక్ష్మారెడ్డి, ఇన్‌చార్జి మునిసిపల్ కమిషనర్



కూలడానికి సిద్ధంగా ఉన్న గుడిసె



కొత్తపేట కాలనీలో ఖాళీ అయిన పూరి గుడిసెలు

ప్రాణ భయంతో ఖాళీ అవుతున్న సామాన్యుల గుడిసెలు

మట్టి పెల్లల కింద శవమై తేలకముందే బతుకు జీవుడా అనుకుంటూ ప్రాణభయంతో సామాన్యుల కాలనీవాసులు పరుగులు తీస్తున్నారు. ఎక్కడో ఒకచోట తలదాచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. మొన్నటికి మొన్న శ్రీకృతి మట్టి పెల్లల కింద శవమయ్యింది. నీటి తంపు కారణంగా ఇప్పటికే సామాన్యుల ఇళ్లు దెబ్బతిన్నాయి. తాత్కాలిక మరమ్మతులతో పూరిగుడిసెలోనే కాపురాలు సాగిస్తున్నారు. పాప చావుతో మరి కొంతమంది ప్రాణ భయంతో గుడిసెలు ఖాళీ చేసి వెళుతున్నారు. మునిసిపల్ అధికారులు మరోపక్క ఖాళీ చేసి వెళ్లాలంటూ నోటీసులు జారీ చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు అయిజ పట్టణంలో 170 మంది పేదలకు నోటీసులు జారీ చేశారు.

నల్లమల వాసికి ఆస్ట్రాలజీ విభాగంలో పీహెచ్‌డీ పట్టా



రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయపూర్‌లో ఆస్ట్రాలజీ విభాగంలో పీ హెచ్‌డీ పట్టా అందుకుంటున్న బరపటి శ్రీశైలం

అమ్రాబాద్, ఆగస్టు 23: నాగర్ కర్నూల్ జిల్లా పదర మండల వంకేశ్వరం గ్రామానికి చెందిన బరపటి శ్రీశైలం నవగ్రహాలు మానవులపై ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తాయని (ఆస్ట్రాలజీ) అంశంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా పొందారు. రాజస్థాన్ రాష్ట్రం ఉదయపూర్‌లో మహర్షి వేదిక ఆస్ట్రాలజీ కాలేజీలో తన ప్రతిభతో పరిశోధన చేసిన శ్రీశైలం పట్టాను శుక్రవారం ఉదయపూర్‌లో అందుకున్నట్లు కుటుంబ సభ్యులు విలేకరులకు తెలిపారు. డాక్టరేట్ పట్టా అందుకున్న శ్రీశైలం ఈ ప్రాంతానికి చెందిన పలువురు ఉద్యోగులు, విద్యావంతులు, మేధావులు సహ విద్యార్థులు అభినందించారు.

అటవీ శాఖ అధికారులకు మొసలి అప్పగింత



మల్దకల్‌లో మొసలిని మోసుకెళ్తున్న గ్రామస్థులు, అధికారులు

మల్దకల్, ఆగస్టు 23 : జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ గ్రామ సమీపంలోని పత్తి పంటలో ఉన్న మొసలిని గ్రామస్థులు అటవీశాఖ అధికారుల సహాయంతో బంధించి నదిలో వదిలారు. జూరాల నుంచి విడుదలైన వరదనీటి జలాల నుంచి మల్దకల్ దేవర చెరువులోకి వచ్చిన మొసలి ఆ పక్కనే ఉన్న పత్తి పొలంలోకి వెళ్లింది. పొలానికి వచ్చిన కూలీలు మొసలిని చూసి రెవెన్యూ, పోలీసు, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆరుగంటల పాటు అధికారులు శ్రమించి మొసలిని బంధించారు. మొసలిని తీసుకెళ్లి నదిలో వదిలినట్లు పోలీసులు తెలిపారు.

సుంకేసుల జలాశయానికి తగ్గిన వరద



నిండుకుండను తలపిస్తున్న సుంకేసుల డ్యాం

రాజోలి, ఆగస్టు 23 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండల కేంద్ర శివారులో ఉన్న సుంకేసుల జలాశయానికి వరద తగ్గుముఖం పట్టింది. శుక్రవారం జలాశయానికి 38,200 క్యూసెక్కుల వరద నీరు వస్తుండటంతో జలాశయం నుంచి ఎనిమిది గేట్ల ద్వారా 35,800 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని డ్యాం జేఈ రాజు తెలిపారు. డ్యాం నీటి సామర్థ్యం 292.00 కాగా, ప్రస్తుతం 292.00 మీటర్లు నమోదైంది. నీటి నిల్వ 1.20 టీఎంసీలు కాగా ప్రస్తుతం పూర్తి ఎఫ్ఆర్ఎల్‌తో నిండుకుండలా ఉందని, కర్నూలు కేసీ కెనాల్‌కు యదావిధిగా రెండు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జలాశయం అధికారులు తెలిపారు.

లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

మహమ్మదాబాద్, ఆగస్టు 23 : ఓ బాలికపైన లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మహమ్మదాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎస్ఐ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్‌లో నెల రోజుల కిదంట ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలి బంధువులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాళం వేసిన ఇంటికి కన్నం వేసిన దుండగలు

- నగదు, మూడు తులాల బంగారం చోరీ

అచ్చంపేటటౌన్, ఆగస్టు 23 : తాళం వేసిన ఇంటికి కన్నం వేసి కొంత నగదు, మూడు తులాల బంగారం దొంగిలించిన సంఘటన శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని సాయినగర్ కాలనీలో చోటు చేసుకుంది. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన మంత్రాల లింగమయ్య ఇంటికి తాళం వేసి ఉద్యోగ్యానికి వెళ్లి తిరిగి సాయంత్రం వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. అవాక్కయిన అతడు ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగలకొట్టి కొంత నగదు, మూడు తులాల బంగారాన్ని దుండగులు తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

పేకాటరాయుళ్లపై దాడి

- రూ. 12వేలు స్వాధీనం

అచ్చంపేటటౌన్, ఆగస్టు 23: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని టంగాపూర్ కాలనీలో పేకాట రాయుళ్లపై పోలీసులు దాడి చేశారు. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేట, పోలిశెట్టిపల్లి, గంగాపురి చెన్నారం, చౌటపల్లి గ్రామాలకు చెందిన ఐదుగురు పట్టణంలోని లింగాల రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో పేకాట ఆడుతుండగా దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ 12,230 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోస్గి, ఆగస్టు 23: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన నారాయణపేట జిల్లా గుండుమల్ మండలం హన్మాన్‌పల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ప్రవీణ్ అనే వ్యక్తి ఈనెల 14న భార్య తిరుపతమ్మ ఊరైన వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం ఈర్లపల్లి గ్రామానికి వెళ్లాడు. అక్కడ భార్య, భర్త గొడవపడ్డారు. మనస్తాపానికి గురైన ప్రవీణ్ స్వగ్రామానికి వచ్చి పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ విషయంపై ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్సై వెంకటరమణ తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలి

- టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ

- సీపీఎస్ ఉత్తర్వుల ధ్రువపత్రాలను దహనం చేసిన నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 23 : ప్రభుత్వం వెంటనే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్‌సీపీఎస్ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఆగస్టు 23ను సీపీఎస్ బ్లాక్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సనాతన బాలస్వామి, కేఎం చంద్రకాంత్‌లు బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల నివాళ్లు అర్పించారు. అనంతరం ఉద్యోగ, ఉపాధ్యాయులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు, ఈ సందర్భంగా అయన మీడియాతో మాట్లాడారు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సందర్భంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని చెప్పిన అప్పటి పాలకులు దాన్ని కాలరాశారన్నారు. కనీసం ఉద్యోగులతో, ఉద్యోగ సంఘాలతో గాని చర్చించలేదన్నారు. నిరంకుశ ధోరణితో ఆనాటి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. జీవో 23 తీసుకువచ్చి ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు చీకటి రోజుగా మారిందన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు 32 జిల్లాలో జీవో 28 ప్రతులను దహనం చేసినట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం వెంటనే పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. లేకపోతే ఉద్యమం మరింత ఉధృతం అవుతుందన్నారు. సీపీఎస్ జీవో ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు బాలస్వామి, చంద్రకాంత్, కోశాధికారి రాఘవేంద్ర, నాయకులు మల్లేష్, ఆంజనేయులు, విజయ్, ఖాదర్, సందీప్, వెంకటేశ్, రామానాయుడు, వజ్రకుమార్, సరస్వతి, గౌరమ్మ పాల్గొన్నారు.



తెలంగాణ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

దారిలో అడ్డంకిగా..

- విద్యుత్ స్తంభాలతో పొంచి ఉన్న ప్రమాదం
- భయాందోళన చెందుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 23 : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అంతర్గత రహదారిపై మధ్యలో స్తంభాలు కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా మారడంతో ఆ కాలనీ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ఆ కాలనీవాసులు నిత్యం బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో గత కొన్నేళ్ల క్రితం రెండు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఆ కాలనీలో అంతర్గత రహదారి మధ్యలో స్తంభాలు అడ్డంగా ఉన్నాయి. రహదారి మధ్య స్తంభాలు ఉండటం వలన ఆ కాలనీవాసుల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతున్నది. అంతేకాక ఇనుప స్తంభాలు తుప్పు పట్టిపోవడం విరిగి పడితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆ కాలనీవాసులు భయాందోళనకు గురవుతు న్నారు. అదే విధంగా రహదారి పక్కన కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా మారింది. పిల్లలు, పెద్దలు, పశువులు ఆ రహదారిపై నిత్యం సంచరిస్తుంటాయి. ఆదమరిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. రహదారిపై అడ్డంగా ఉందని ఆందోళన చెందుతున్నారు.



కల్వకోల్ ఎస్సీ కాలనీలో రహదారి పక్కన ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



కల్వకోల్ ఎస్సీకాలనీలో రహదారిపై అడ్డంగా ఉన్న స్తంభాలు

రహదారిపై అడ్డంగా ఉన్న స్తంభాలను తొలగించాలని వేరే చోట ఏర్పాటు చేయాలని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులు ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆ కాలనీవాసులు ఆరోపించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామంలోని ఎస్సీ కాలనీలో రహదారిపై అడ్డంగా ఉన్న స్తంభాలు తొలగించి వేరే చోట ఏర్పాటు చేయాలని ఆ కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రమాదభరిత స్తంభాలను తొలగించాలి

కల్వకోల్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో రహదారిపై అడ్డంగా ఉన్న స్తంభాలను వెంటనే తొలగించాలి. మా ఇంటి వెనక భాగంలో రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ ఇనుప స్తంభాలు తుప్పు పట్టి ఒరిగి ఉన్నాయి. రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. స్తంభాలు విరిగి మా ఇంటి మీద పడితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అలాగే కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా మారింది. అధికారులు చర్యలు తీసుకుని ప్రమాదం జరగక ముందే వాటిని తొలగించి వేరేచోట ఏర్పాటు చేయాలి.

- కూన రాముడు, కల్వకోల్

అదృశ్యమైన వివాహిత హత్య

● బామ్మర్దులపై కోపంతోనే భార్యను హత్య చేసిన భర్త



హత్యకు గురైన అనిత (ఫైల్)

జడ్చర్ల, ఆగస్టు 23 : అదృశ్యమైన వివాహిత హత్యకు గురయ్యింది. బామ్మర్దులపై కోపంతో భార్యను భర్తనే హత్య చేసిన సంఘటన జడ్చర్ల మండలం పోలేపల్లి సమీపంలో చోటుచేసుకుంది. జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. జడ్చర్ల మండలం కిష్టారం గ్రామానికి చెందిన జంగిరెడ్డి, అనితలు భార్య, భర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. కుమార్తెల వివాహాలు అయ్యాయి. ఇటీవల అనిత సోదరులు భూమిని విక్రయించారు. వచ్చిన డబ్బులలో అనితకు సోదరులు ఇవ్వలేదు. అలాగే అనిత సోదరికి కొంత ఇచ్చారు. బామ్మర్దులు తమను పట్టించుకోకపోవడంతో భార్యభర్తల మధ్య ఇటీవల గొడవ జరిగింది. ఈ నెల 17న కిష్టారం గ్రామం నుంచి ద్విచక్రవాహనంపై జంగిరెడ్డి తన భార్య అనిత (40)ను పోలేపల్లి మీదుగా మాచారం వచ్చే దారిలో ఉన్న డంపింగ్‌యార్డు వద్దకు తీసుకెళ్లాడు. అనిత గొంతుకు చీరను బిగించి హత్యకు పాల్పడ్డాడు. అనంతరం అనిత తలపై బండరాయితో మోది, డంపింగ్‌యార్డులో పారవేసాడు. తన భార్య కనిపించడంలేదంటూ ఈ నెల 20న జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసాము. కాగా జంగిరెడ్డి ప్రవర్తనలో మార్పు కనిపించడంతో చిన్న కుమార్తె మానసకు అనుమానం వచ్చింది. తల్లి కనిపించకుండ పోవడానికి తండ్రి కారణంగా పేర్కొంటూ అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టడంతో డంపింగ్‌యార్డులో మృతదేహం ఉన్నట్లుగా గుర్తించడం జరిగింది. డంపింగ్‌యార్డులో నుంచి మృతదేహంను బయటికి తీసి, అక్కడే వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహంను కుటుంబసభ్యులకు అప్పగించడం జరిగిందని సీఐ వివరించారు. కేసు నమోదు చేసుకుని మిస్సింగ్ కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ ఆదిరెడ్డి వివరించారు.

వ్యక్తి అదృశ్యం - కేసు నమోదు

జడ్చర్ల, ఆగస్టు 23 : ఆరు నెలల క్రితం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిన కుమారుడు వంగూరు రాజు(37), తిరిగి ఇంటికి వస్తాడని ఎదురుచూసినా, ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో తండ్రి వంగూరు లక్ష్మయ్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు. జడ్చర్ల పట్టణంలోని మాధవరావు కాంపౌండ్‌కు చెందిన లక్ష్మయ్యకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. చిన్న కుమారుడు రాజుకు 2010లో ఖిల్లాఘనపురానికి చెందిన సరితతో వివాహం జరిపించారు. 10 సంవత్సరాల క్రితం బదుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లారు. రెండు సంవత్సరాల క్రితం భార్య, భర్తల మధ్య సంసారం విషయంలో మనస్పర్ధలు రావడంతో విడిపోయారు. అప్పటి నుంచి జడ్చర్లలో తండ్రి లక్ష్మయ్యతోనే రాజు నివాసం ఉంటున్నాడు. కాగా ఆరు నెలల క్రితం వెళ్లిన తన కుమారుడు నేటికీ రాకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు లక్ష్మయ్య తన ఫిర్యాదులో పేర్కొన్నాడని, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ ఆదిరెడ్డి వివరించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

భూత్పూర్, ఆగస్టు 23 : విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం మునిసిపాలిటీ కేంద్రమైన భూత్పూర్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మునిసిపాలిటీలోని కెంద్యాల చెన్నమ్మ (52) అనే మహిళ ఇంటి వద్ద ఉన్న బాత్‌రూము తలుపులు తీస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఘటన జరిగిన సమయంలో మృతురాలి భర్త కెంద్యాల వెంకట్‌రాములు కూలీ పని నిమిత్తం బయటికి వెళ్లాడు. ఇంటి దగ్గర మృతురాలు కెంద్యాల చిన్నమ్మ, ఆమె మనుమరాలు నందిని ఇద్దరు మాత్రమే ఉన్నారు. విషయాన్ని మనుమరాలు నందిని ఫోన్ ద్వారా తాతకు సమాచారం ఇవ్వడంతో ఆయన హుటాహుటిన ఇంటికి వచ్చి చూడగా భార్య విద్యుత్ షాక్‌తో చనిపోయి పడి ఉంది. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, ఆగస్టు 23 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత రవితేజ జూనియర్ కళాశాల వెనక గల రైతు పొలంలో గురువారం రాత్రి గాలివానకు కరెంటు తీగ తెగిపడడంతో పాడి ఆవు మృతి చెందింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన రైతు తిమ్మాజీపేట నరేందర్ రోజులాగే వ్యవసాయ పొలం వద్ద చెట్టు కింద ఆవులు కట్టేశాడు. రాత్రి గాలివాన బీభత్సంతో చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో తీగ తెగిపడింది. దీంతో అక్కడ ఉన్న పాడి ఆవు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ లక్ష రూపాయలు ఉంటుందని, వారం రోజుల్లో ఆవు ఈనేదని రైతు కన్నీటిపర్యంతమయ్యాడు. ప్రభుత్వం, విద్యుత్ శాఖ ద్వారా నష్ట పరిహారాన్ని అందించి ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు. ఈ ఘటనపై స్థానిక తహసీల్దార్‌తో పాటు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపారు.

చంద్రకల్‌లో..

పెద్దకొత్తపల్లి: ప్రమాదవశాత్తున విద్యుదాఘాతానికి గురై ఒక ఆవు మృతి చెందిన సంఘటన చంద్రకల్ గ్రామ శివారులో శుక్రవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకొత్తపల్లి మండలం చంద్రకల్ గ్రామానికి చెందిన కే అర్జున్ తన పశువులను మేపుకు రావడానికి గ్రామ శివారులోకి వెళ్లాడు. వ్యవసాయ పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఉన్న అర్త్ వైరుకు ఆవు తగలడంతో అక్కడికక్కడే ఆవు మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. మృతి చెందిన ఆవు విలువ దాదాపు 50వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని బాధితుడు కోరారు.



చంద్రకల్ శివారులో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఆవు

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

కృష్ణ, ఆగస్టు 23: కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండలం టైరోడ్ వద్ద శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా పరిధిలోని కాడెచూర్ గ్రామానికి చెందిన తాయప్ప అనే వ్యక్తి ఎరువులు కొనుగోలు చేసేందుకు టైరోడ్‌కు వచ్చాడు. తిరిగి కడెచూర్‌కు వెళ్తుండగా కారు ఢీకొని కుడికాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యా వ్యవస్థపై 27న పాలమూరులో సదస్సు

- టీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణయ్య



సదస్సు బ్రోచర్లను విడుదల చేస్తున్న టీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, అధ్యాపకులు

గద్వాల టౌన్, ఆగస్టు 23 : తెలంగాణ లెక్చరర్స్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 27న పాలమూరులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర విద్యా వ్యవస్థపై సమాలోచన సదస్సు నిర్వహించనున్నట్లు టీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణయ్య తెలిపారు. సదస్సుకు సంబంధించిన బ్రోచర్లను శుక్రవారం జోగుళాంబ గద్వా జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎం డిగ్రీ, పీజీ కళాశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణయ్య మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో విద్యారంగం నిర్లక్ష్యానికి గురైందన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి గతనెలలో విద్యా రంగంపై సమీక్ష నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యారంగం అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి, సంస్కరణలకు పలు యాజమాన్యాలు, విద్యారంగ నిపుణులు, ఉపాధ్యాయ, అధ్యాపక, ఆచార్యులు, తల్లిదండ్రులు తమ విలువైన సలహాలు, సూచనలతో ముందుకు రావాలన్నారు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించే సదస్సుకు నిపుణులు, మేధావులు, ఉపాధ్యాయులు, ఆచార్యులు, విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో టీఎల్ఎఫ్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు రమేష్‌గౌడ్, మోహన్‌రెడ్డి, ఎస్‌వీఎం కళాశాలల చైర్మన్ నారాయణగౌడ్, కృష్ణవేణి కళాశాల చైర్మన్ రమేష్, జ్ఞానప్రభ విద్యాసంస్థల చైర్మన్ అప్సర్‌పాషా, గద్వాల టీఎల్ఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ మహేందర్, అధ్యాపకులు రవి, నాగరాజు, అరుణ్‌కుమార్ ఉన్నారు.

వేణుగోపాల స్వామి దేవాలయం ముస్తాబు



ముస్తాబైన వేణుగోపాలస్వామి దేవాలయం

నారాయణపేటరూరల్, ఆగస్టు 23: మండలంలోని లోకపల్లిలో వెలసిన వేణుగోపాల స్వామి దేవాలయం కృష్ణాష్టమి వేడుకలకు సిద్ధమైంది. ఈ వేడుకలు ఈనెల 26న రాత్రి 12గంటలకు డోలారోహణంతోప్రారంభమై 27న ఉదయం 10గంటలకు గోపూజ, అన్నదానం, సాయంత్రం ఉట్టి కార్యక్రమంతో ముగుస్తాయి. ఈ ఉత్సవాల కోసం ఆలయానికి రంగులు వేసి అన్ని ఏర్పాట్లను చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కాంట్రాక్టర్ బాలప్పయాదవ్, భైరంకొండల నర్సిములు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



రాకెట్ ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

నారాయణపేటరూరల్, ఆగస్టు 23: మండల పరిధిలోని జాజాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చంద్రయాన్-3 గురించి విద్యార్థులకు తెలియజేశారు. హెచ్‌ఎం భారతి, జిల్లా సైన్స్ అధికారి భానుప్రకాశ్ మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్ మక్కువ పెంచాలన్నారు. బాల్యంలోనే అంతరిక్ష పరిశోధనపై ఆసక్తి పెంచి లోతైన ప్రయోగాలు చేసేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు రాకెట్ ఆకారంలో కూర్చుడం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిర్మల, శశిరేఖ, మధుసూదన్‌రావు, లక్ష్మణ్, ప్రతాప్, నరసింహ, శిరీష, మంగళ, వెంకటేశ్ పాల్గొన్నారు.

హంసవాహిని ఉన్నత పాఠశాలలో ..

నారాయణపేట: పట్టణంలో స్థానిక హంసవాహిని ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అదేవిధంగా గతేడాది శ్రీహరికోట నుంచి ప్రయోగించిన చంద్రయాన్-3 ప్రయోగాన్ని విద్యార్థులకు ప్రొజెక్టర్ ద్వారా తిలకించారు. సైన్స్ ప్రముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేష్‌కుమార్, సైన్స్ టీచర్ నమ్రత, శ్రీనివాస్, నర్సిములు, తిరుపతి, రేవతి, భారతి పాల్గొన్నారు.

కొండాపూర్ గురుకులంలో..

ధన్వాడ: ధన్వాడ మండలం కొండాపూర్ గురుకులంలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా చంద్రయాన్ నమూనాను ప్రదర్శించారు. విద్యార్థులకు చంద్రయాన్ గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజారాం, వైస్ ప్రిన్సిపాల్ సాంబ్యానాయక్, సంతోష్ నాయక్, శ్రీధర్‌గౌడ్, అనిల్ సింగ్, తిమ్మప్పతో పాటుగా పలువురు పాల్గొన్నారు.

రెనివట్ల ఉన్నత పాఠశాలో..

మద్దూర్ : అంతరిక్షరంగంలో ఇస్రో సాధించిన విజయాలు అద్వితీయమని రెనివట్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సతీష్ అన్నారు. మండలంలోని రెనివట్ల ఉన్నత పాఠశాలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు బ్రహ్మయ్య, సాయికుమార్, రాజశేఖర్ తదితరులున్నారు.

భవానీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు

నారాయణపేట, ఆగస్టు 23: మండలంలోని సింగారం శ్రీగిరికొండపై కొలువైన భవానీమాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పుష్పార్చన, కుంకమార్చనలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ చేపట్టారు. మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

నారాయణపేట టౌన్, ఆగస్టు 23: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. నారాయణపేట విద్యాధికారికి కార్మికులతో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత 22 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన కార్మికులుగా పనిచేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని, వంటపాత్రలు, కోడిగుడ్లు, సిలిండర్లు ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. అలాగే కార్మికులకు ఏకరూప దుస్తువులు అందించాలన్నారు. నాయకులు కొండన్న, జమీర్, లక్ష్మీ, చిన్న సాయమ్మ, భీమమ్మ, పెద్ద సాయమ్మ, రాములమ్మ, అనంతమ్మ పాల్గొన్నారు.

'సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి'

దామరగిద్ద, ఆగస్టు 23: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు కోరారు. శుక్రవారం మండలంలోని దామరగిద్ద, కందెన్‌పల్లి, మొగుల్‌మడ్క పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని, పీఆర్‌సీ కమిటీ నివేదికపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి 30 శాతం ఫిట్‌మెంట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 310 జీవో వలన నష్టపోయిన వారికి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్.కిష్టయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, రవికుమార్, వెంకట్‌నాయక్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా పౌరసరఫరాల అధికారి సుదర్శన్

ఊట్కూర్, ఆగస్టు 23: విద్యార్థుల నాణ్యమైన భోజనం పెట్టాలని జిల్లా పౌరసరఫరాల అధికారి ఎన్. సుదర్శన్ అన్నారు. శుక్రవారం మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, అమలు చేస్తున్న మెనూ తదితర వివరాలను పరిశీలించారు. అనంతరం బియ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియ్యంలో పురుగులు రాకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతీ రోజు మెనూ పాటించాలన్నారు. ఆయన వెంట పౌరసరఫరాల మండల అధికారి కాళప్ప, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముడుమల్ గ్రామంలో డీఎస్పీ విచారణ

కృష్ణ, ఆగస్టు 23: కృష్ణ పీఎస్ పరిధిలోని ముడుమల్ గ్రామంలో ఈ నెల 19న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయ్యింది. శుక్రవారం డీఎస్పీ లింగయ్య గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా బాధితులతో మాట్లాడారు. ఆయన డీఎస్పీ మాట్లాడుతూ ముద్దాయిలను కూడా విచారించి అనంతరం చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఆయన వెంట కృష్ణ ఎస్ఐ నవీద్ , సిబ్బంది తదితరులున్నారు.

అగ్నివీర్ వాయుసేనపై అవగాహన

నారాయణపేట, ఆగస్టు 23: యువత సైన్యంలో పని చేయాలని ఎయిర్‌ఫోర్స్ వింగ్ అధికారి సందీప్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అగ్నివీర్ వాయుసేన విభాగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నివీర్ వాయుసేన నియమకాలకు సంబంధించి విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మెర్సీవసంత, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

కోస్గి, ఆగస్టు 23: మహిళా చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని షీటీమ్ సభ్యులు దేవయ్య, సమీనా సూచించారు. శుక్రవారం మండలంలోని మీర్జాపూర్ జిల్లాపరిషత్ పాఠశాలలో విద్యార్థులకు మహిళా చట్టాలు, బాల్యవివాహాలు, ఈవ్‌టీజింగ్, సోషల్‌మీడియాపై అవగాహన కల్పించారు. షీటీమ్ సభ్యులు మాట్లాడుతూ పాఠశాలలో, మార్గంలో, ఈవ్‌టీజింగ్‌కు గురైనప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మహిళల చట్టాలు కఠినంగా ఉన్నాయన్నారు. ఒకసారి కేసు నమోదు అయితే జీవిత కాలం ఇబ్బందులు పడాల్సి వస్తాదన్నారు. యుక్త వయసులో ఉన్న తమ పిల్లల దైనందిక కార్యకలాపాలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. బాల్యవివాహాలు చేయరాదని, అలా ఎవరైన చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్‌మీడియా ఇన్‌స్ట్రాగ్రాం, వాట్సాప్, ఫేస్‌బుక్‌ల్లో ఫొటోలు పెట్టరాదని వాటిని వాడుతున్నప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలి

- ఎస్పీ యోగేష్ గౌతమ్
- నర్వ పోలీస్ స్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

నర్వ, ఆగస్టు 23: పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం నర్వ ఠాణాను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ప్రతీ రోజు పోలీస్ స్టేషన్‌కు ఎలాంటి ఫిర్యాదులు వస్తున్నాయని స్టేషన్ రిసెప్షన్ అధికారి దేవిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతీరోజు పోలీస్ స్టేషన్‌ను శుభ్రంగా ఉంచాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలన్నారు. సమస్యను పూర్తిగా విని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డయల్ 100 ద్వారా ఫిర్యాదు వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించాలన్నారు, పాత నేరస్తులపై నిఘా ఏర్పాటు చేయాలని, రాత్రి వేళల్లో పెట్రోలింగ్ తప్పని సరిగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో దొంగతనాలు జరుగకుండా నిఘా ఏర్పాటు చేయాలన్నారు. వాహనాలను తనిఖీ చేయాలని సూచించారు. సైబర్ నేరాలపైన, ట్రాఫిక్ నిబంధనలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్సై కుర్మయ్యను ఆదేశించారు. స్టేషన్‌లో సిబ్బంది యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ఎలాంటి సమస్యలున్నా నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు చేస్తే కఠిన చర్యలు

నారాయణపేట, ఆగస్టు 23: సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటా మని ఎస్పీ యోగేష్ గౌతమ్ శుక్రవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ప్రతికూల పోస్టులు చేస్తున్నవారిని పోలీ స్‌శాఖ అత్యంత నిశితంగా గమనిస్తోందన్నారు. సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దుష్ప్రచారం, ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధంగా పోస్టులు పెట్టేవారిపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. రాజకీయాలకు, కుల, మత, ప్రాంతాలకు విఘాతం కల్గించే వాటిని సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసినా చర్యలు తప్పవన్నారు. ఈ తరహా నేరాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి అదుపులోకి తీ సుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

క్రీడాకారులకు మెళకువలు నేర్పించాలి

- మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్, ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్



గోపాలాన్ని సన్మానిస్తున్న ఒబేదుల్లా కొత్వాల్

మక్తల్, ఆగస్టు 23: మక్తల్ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు మరిన్ని క్రీడా మెళకువలు నేర్పి జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాణించేలా కృషి చేయాలని మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్, ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. శుక్రవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఖోఖో అసోసియేషన్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత పీఈటీ గోపాలం క్రీడా ఆణిముత్యాలను వెలికి తీసి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి పంపిస్తున్నారన్నారు. 70ఏళ్ల వయస్సు వచ్చినా తన సొంత ఖర్చులతో గొప్ప క్రీడాకారులను తయారు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా గోపాలంను సన్మానించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విలియమ్స్, నిర్వాహణ కార్యదర్శి బాలరాజయ్య, పీడీలు రమేష్, నిరంజన్, భాస్కర్ వెంకటేష్, రూప, తులసి, సత్యనారాయణ, నిరంజన్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని విమర్శిస్తే ఊరుకునేదిలేదు

- కొడంగల్ అభివృద్ధిని అడ్డుకుంటే తరిమికొడతాం
- ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు అశోక్



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

కోస్గి, ఆగస్టు 23: స్థాయిని మించి ముఖ్యమంత్రిని విమర్శిస్తే ఊరుకునేది లేదని, కొడంగల్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తే తరిమికొడతామని ఎన్ఎస్‌యూఐ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్ అన్నారు. శుక్రవారం కోస్గిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, పట్నం నరేందర్‌రెడ్డిలు రైతులను రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం సరికాదన్నారు. గతంలో పది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు రైతులు గుర్తుకు రాలేదని, రైతులకు బేడీలు వేయించి, పోలీసులతో కొట్టించిన సంస్కృతి మీది కాదా అని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ చేసి రైతులతో మమేకమై వారిని ఆదుకుంటున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. మరోమారు రైతులను రెచ్చగొట్టి మాయమాటలు చెప్పి వారిని రోడ్లపైకి తెస్తే ఊరుకోబోమన్నారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కొడంగల్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని గతంలో ఆయన మాదిరిగా అడ్డగోలు పనులు చేసి ఆక్రమణలు చేయలేదన్నారు. తమ నాయకులు రేవంత్‌రెడ్డిని, తిరుపతిరెడ్డిని దూషిస్తే కొడంగల్‌లో తిరగనియ్యమని హెచ్చరించారు. స్థాయిని మించి మాట్లాడే కొందరు నాయకులకు తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుందన్నారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాధ్యులను అరెస్టు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దళిత సంఘం నాయకులు

మక్తల్, ఆగస్టు 23: క్రిష్ణ మండలంలోని ముడుమాల్ గ్రామంలో యాదవేంద్రస్వామి గుడి పూజారి చక్రపాణిని వెంటనే అరెస్టు చేయాలని దళిత, బీసీ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని నెహ్రూ గంజ్‌లో దళిత బీసీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముడుమాల్ గ్రామంలోని యాదవేంద్రస్వామి గుడిలో దళితులను పెళ్లి చేసుకోకుండా అడ్డుకున్న పూజారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేయకపోతే దళిత, బీసీ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజా, దళిత, బీసీ సంఘాల నాయకులు క్రిష్ణ, నగేష్, కళ్యాణ్, మద్దిలేటి, చంద్రకాంత్‌గౌడ్, బుట్టో, చంద్రశేఖర్, భాస్కర్, శ్రవణ్‌కుమార్, నారాయణ, అంజనేయులు, వెంకటేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

'రహదారికి మరమ్మతు చేయించాలి'

మక్తల్‌రూరల్,ఆగస్టు 23: మక్తల్ పరిధిలోని కాట్రేవ్‌పల్లి, రాయికోడ్ గ్రామాలకు వెళ్లే రహదారి మరమ్మతు చేయించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం గేట్ వద్ద గ్రామస్థులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇటుక బట్టిలకు వెళ్లే వాహనాలు పరిమితికి మించి వెళ్తుండడంతో దారి దెబ్బతిని అధ్వానంగా మారిందన్నారు. వెంటనే మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. గ్రామస్థులతో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఫోన్‌లో మాట్లాడి త్వరలోనే మరమ్మతులు చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు.

దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

- ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజు
- ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ధర్నా

నారాయణపేట, ఆగస్టు 23: దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం నారాయణపేట సత్యానారాయణ చౌరస్తాలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బైఠాయించి ధర్నాను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని జిలాల్‌పూర్ గ్రామంలో ముదిరాజ్ రామలింగప్పపై నారాయణరెడ్డి, లక్ష్మి, అక్షితరెడ్డి, అకిలేష్‌రెడ్డి దాడి చేశారన్నారు. రామలింగప్ప పెద్దలు 30 ఏళ్ల క్రితం కొన్న భూమిపై వివాదం నడుస్తుందన్నారు. రామలింగప్పకు అనుకూలంగా తీర్పు రానున్నడంతో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు దాడిచేసి చంపేందుకు యత్నించారని ఆరోపించారు. బోయ కులస్థులు రక్షించి పేట జిల్లా ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ చికిత్స పొందుతున్న రామలింగప్పను పరామర్శించారు. దాడి చేసిన వారిని అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని, లేనిపక్షంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు కాంత్‌కుమార్, మిర్చి వెంకటయ్య, లక్ష్మీకాంత్, నర్సిములు, రాము, చంద్ర, మల్లేష్, రాజేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



పేటలో ధర్నా చేస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

పెచ్చులూడిన పాఠశాల పైకప్పులు

- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు





పెచ్చులూడి కిందపడిన పాఠశాల పైకప్పు

కృష్ణ, ఆగస్టు 23: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరింది. వారం రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి పాఠశాల పైకప్పు పెచ్చులూడిపడిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 30ఏళ్ల క్రితం పాఠశాలను అప్పటి మంత్రి దివంగత ఎల్కోటి ఎల్లారెడ్డి హయాంలో నిర్మించారని, ప్రస్తుతం పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందన్నారు. మన ఊరు- మన బడి కార్యక్రమంలో పాఠశాలపై ప్రత్యేక దృష్టి పెట్టకపోవడంతో పరిస్థితి మరింత అధ్వానంగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భయాందోళన మధ్య తమ పిల్లలను పాఠశాలకు పంపాల్సిన పరిస్థితి వచ్చిందని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పాఠశాల పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయని వాపోతున్నారు. అనుకోని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ముందస్తుగా అధికారులు స్పందించి నూతన భవన నిర్మాణంపై దృష్టి సారించాలని వేడుకుంటున్నారు.

నర్వలో రేపు వైద్యశిబిరం

నర్వ, ఆగస్టు 23: నర్వ మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ భవనంలో డాక్టర్ సామ్యుల్ సూపర్ స్పెషలిస్ట్ ఆసుపత్రి మహబూబ్‌నగర్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యం శిబిరాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరానికి డాక్టర్ నితీష, వైద్యుల బృందం పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రధానంగా మహిళలకు సంబంధించిన వ్యాధులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. మండల ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

నారాయణపేట, ఆగస్టు 23: వరల్డ్ యూత్ డే సందర్భంగా చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టౌన్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు శుక్రవారం బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లిక్కి రఘుబాబు, మాజీ ప్రిన్సిపల్ లయన్ సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో గోపురాల ఏర్పాటు



కొండదొడ్డిలో గోపురాలకు పూజలు చేసి తెస్తున్న గ్రామస్థులు

మక్తల్‌రూరల్, ఆగస్టు 23: మక్తల్ మండలంలోని కొండదొడ్డి గ్రామంలో ఆంజనేయస్వామి, శివాలయాల్లో గోపురాల ఏర్పాటు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, దాతలు అందరు కలిసి గోపురాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల వితరణ

మక్తల్‌రూరల్, ఆగస్టు 23: మక్తల్ మండలం భూత్పూర్ గ్రామంలో శుక్రవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ చేశారు. మాజీ సర్పంచు హనుమంతు కుమారుడు అశోక్ జన్మదినం సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 70 ప్లేట్లను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సురేష్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు హనుమంతు, ఆనంద్, శేఖర్, ఖతల్ హుస్సేన్, లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

28న ఆటల పోటీలు

మక్తల్, ఆగస్టు 23: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని మక్తల్ నియోజకవర్గ స్థాయిలో పాఠశాలల విద్యార్థులకు క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మక్తల్ మండల నోడల్ అధికారి, జీహెచ్‌ఎం అనిల్‌గౌడ్, నిర్వాహకులు విష్ణువర్ధన్‌రెడ్డి, జగదీష్, పీడీలు విష్ణువర్ధన్‌రెడ్డి, భీంరెడ్డి, రాఘవేంద్ర శుక్రవారం తెలిపారు. బాలబాలికలలకు కబడ్డీ, వాలీబాల్, టెన్నికయిట్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 28న ఉదయం 9గంటలకు జ్యోతిని వెలిగించి మినీ స్టేడియంలో క్రీడలు ప్రారంభిస్తారన్నారు. పోటీల్లో పాల్గొనే వారు ఈనెల 25వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

బీఆర్ఎస్ ధర్నాలో పాల్గొనలేదు

నారాయణపేట టౌన్, ఆగస్టు 23: నారాయణపేట జిల్లా కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో తాను పాల్గొనలేదని పుట్టి ఈదప్ప అన్నారు. తాను ధర్నాలో పాల్గొన్నట్లు పత్రికల్లో వార్త రావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు శుక్రవారం పేర్కొన్నారు.

నేడు భూనీటి ఆంజనేయస్వామి ఉత్సవాలు

కొత్తపల్లి ఆగస్టు 23 : మండలంలోని భూనీటి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నిర్వహించనున్నట్లు శుక్రవారం ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జల్దిబిందె కార్యక్రమం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నాం వరకు ఉంటుందన్నారు. స్వామివారికి అభిషేకం, అర్చనలు రాత్రి 9 గంటల నుంచి ఆదివారం తెలవారుజామున 4 గంటల వరకు భ జన, సంకీర్తనలు అనంతరం 5గంటల నుంచి రథోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.

నేడు ఆదిహనుమాన్ రథోత్సవం

మరికల్: మండల పరిధిలోని కిష్టంపల్లి రోడ్డులో వెలసిన ఆంజనేయస్వామి బ్రహోత్సవాలు, అలాగే ఆత్మకూర్ రోడ్డులో ఆదిహనుమాన్, కాశీవిశ్వేశ్వర రథోత్సవం, ఎల్లిగండ్లలో చెన్నకేశవ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారికి జల్దిబిందె ఊరేగింపుగా, అర్చకులు, అభిషేకం, రుద్రాభిషేకం, ఆకులపూజతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.